క్లుప్తంగా

వసతిగృహాల తనిఖీ



బాలుర వసతి గృహంలో భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా బీసీ వేల్ఫేర్ అధికారి యశోదరరావు

భోగాపురం: మండలంలోని రావాడ, భోగాపురంలోని బాలుర వసతిగృహాలను జిల్లా బీసీ వేల్ఫేర్ అధికారి బి.యశోదరరావు గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున అందరూ బాగా చదువుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వార్డెన్ ఎండా అప్పన్న, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో పోలీస్ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: పట్టణంలోని హుకుంపేట, లంకాపట్నం ప్రాంతాల్లో గురువారం వేకువజామున 4 గంటల నుంచి 6 వరకు పోలీసులు కార్డన్ సెర్చ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. నేరాల నియంత్రణలో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఆర్.శ్రీనివాసరావు, ఎల్.శేషాద్రి, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

భోగాపురం: మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను ఎంపీడీఓ దాసరి బంగారయ్య గురువారం పరిశీలించారు. సౌకర్యాల కల్పన, ఇతరత్రా విషయాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎస్సై కృష్ణమూర్తి, వీఆర్ఓ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమతో నడుచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం బాలాజీ

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ బాధితులతో ప్రేమగా నడుచుకోవాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి డీపీఎం పి. బాలాజీ అన్నారు. గురువారం స్థానిక విజయ పాజిటివ్ నెట్‌వర్క్ కార్యాలయంలో హెచ్ఐవీ బాధితులకు రూ. 30 వేల విలువ చేసే పౌష్టికాహారాన్ని అమ్మ సేవా సొసైటీ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా హెచ్ఐవీ రోగుల జీవితకాలాన్ని పెంచవచ్చన్నారు. కార్యక్రమంలో పద్మావతి పాల్గొన్నారు.

చురుగ్గా జంగిల్ క్లియరెన్స్



రామతీర్థంలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేయిస్తున్న ఎస్సై నారాయణరావు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో రేపటి నుంచి రెండు రోజుల పాటు జరగనున్న శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఎస్సై నారాయణరావు ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్ పనులు గురువారం చేపట్టారు. కొత్తపేట నుంచి సతివాడ జంక్షన్ వరకు రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, మట్టి దిబ్బలను ప్రొక్లయినర్ సహకారంతో తొలగించారు. సీతారామునిపేట, దన్నానపేట జంక్షన్లలో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశామని భక్తులు గమనించాలని ఎస్సై కోరారు.

వరహాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

భోగాపురం: మండలంలోని సుందరపేటలో వెలిసిన వరహాలమ్మ పేరంటాలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు శాస్త్రోక్తంగా ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సుందర హరీష్, పడాల శ్రీనివాసరావు, వెంకటాద్రి, కొయ్య బంగార్రాజు, ఊడికల గురువులు, ఆళ్ళ మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖజానాకు గండి...

- కొందరి గుప్పిట్లోనే కార్పొరేషన్ దుకాణ సముదాయాలు
- వసూలు కాని అద్దె
- సబ్ లీజుల పేరిట వేరే వారికి దుకాణాల అప్పగింత
- కొత్తవారికి దక్కని అవకాశాలు



పాత ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్

విజయనగరం: ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడంలో కార్పొరేషన్ యంత్రాంగం విఫలమవుతోంది. రూ. కోట్లు ఖర్చు చేసి నిర్మించిన దుకాణాల్లో చాలా వరకు ఏళ్ల తరబడి కొందరి గుప్పెట్లో ఉండిపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుండగా... నిర్మాణ దశలో సరైన వసతులు కల్పించకపోవడంతో మరికొన్ని దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో భవనాలు శిథిలావస్థకు చేరుతుండగా.... రావాల్సిన ఆదాయం సక్రమంగా ఖజానాకు జమకాని పరిస్థితి నెలకొంది. అధికారిక లెక్కల ప్రకారం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మొత్తంగా 373 దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా పాత, కొత్త బకాయిలు కలిపి రూ.3.44 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.2.34 కోట్లు వసూలు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మరో రూ.1.09 కోట్లు వసూలు కావాల్సి ఉంది. మిగిలిన డిమాండ్‌ను ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా వసూలు చేయాలని నిర్ణయించారు. అయితే కార్పొరేషన్ దుకాణ సముదాయాలు కొందరికి బంగారు బాతుల్లా మారడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఆయా దుకాణాల్లో ఏళ్ల తరబడి నచ్చినట్లు వ్యాపారాలు చేసుకుంటున్న వారు కొందరైతే.. మరికొందరు సబ్‌లీజ్‌ల పేరిట దుకాణాలను వేరే వారికి అప్పగించి ఆర్థికంగా లాభపడుతున్నారు. పోనీ అద్దె అయినా సక్రమంగా చెల్లిస్తున్నారా అంటే అదీ లేదు. ప్రభుత్వ భవనాల్లో దుకాణాలు సొంతం చేసుకొని దర్జాగా లాభాలు గడిస్తూ అద్దె చెల్లించని వారికి యంత్రాంగంలో కొందరి సహకారం ఉందనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. నగరంలోని పాత ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్, కొత్త ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్, విపణికల్ప కాంప్లెక్స్ జనతా బజార్, కర్రల బడ్డీలు, కృష్ణ థియేటర్ ఎదురుగా గల షాపింగ్ కాంప్లెక్స్, మెయిన్‌రోడ్డులో నాలుగు దుకాణాలు ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. వాటిని అద్దె, లీజు ప్రాతిపదికన కేటాయిస్తారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి వేలం నిర్వహిస్తారు. కొందరుమాత్రం అదనంగా పది శాతం డబ్బులు చెల్లించి కొనసాగుతున్నారు. అద్దెకు తీసుకున్నవారు సక్రమంగా అద్దె చెల్లించడం లేదు. వాస్తవానికి కార్పొరేషన్ రెవెన్యూ సిబ్బంది బకాయిదారులను గుర్తించి ఎప్పటికప్పుడు నోటీసులు జారీ చేయాలి. కొందరు నోటీసులు అందుకున్నా స్పందించడం లేదు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు అధికారులు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. అయితే ఇదంతా కేవలం అద్దెల వసూళ్ల వరకే పరిమితమవుతుండగా.. సబ్‌లీజ్‌ల పేరిట అద్దెలకిచ్చిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

చర్యలు తీసుకుంటాం



కార్పొరేషన్ పరిధిలోని దుకాణ సముదాయాల్లో అద్దెల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. మొండి బకాయిదారులపై ఒత్తిడి పెంచుతున్నాం. దుకాణాల సబ్ లీజుల విషయం మా దృష్టికి వచ్చింది. ఈ విషయంపై సర్వే చేయిస్తాం. అసలు ఎంత మంది లీజుదారులు సొంతంగా దుకాణాలు నిర్వహిస్తున్నారు... ఎంత మంది సబ్‌లీజులకు ఇచ్చారన్న వివరాలను నివేదిక తయారు చేస్తాం. కౌన్సిల్‌లో వివరాలు పొందిపరిచి తీర్మానం మేరకు చర్యలు తీసుకుంటాం.

– పీవీడీ ప్రసాదరావు, అసిస్టెంట్ కమిషనర్, విజయనగరం కార్పొరేషన్.

ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దు..



వీటీ అగ్రహారం మహిళా ప్రాంగణ సమీపంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కుమార్

- ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్ కుమార్

విజయనగరం క్రైమ్: భారతీయ రైల్వేలు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ప్రయాణికుల సౌలభ్యం కోసం అందుబాటులో ఉంచిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కుమార్ కోరారు. స్థానిక వీటీ అగ్రహారం మహిళా ప్రాంగణం సమీపంలో ఉన్న రైల్వేట్రాక్ వద్ద రైల్వేట్రాక్‌లు దాటుతూ వచ్చే ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సులభంగా దాటేయవచ్చనే ఉద్దేశంతో ప్రజలు రైల్వే పట్టాలు దాటుతున్నారన్నారు. అయితే డీప్ కర్వ్‌లున్న ప్రదేశం కావడంతో రైలు వస్తుందన్న విషయాన్ని కూడా గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. ఇటీవల కాలంలో చాలామంది ప్రమాదాల బారిన పడ్డారని తెలిపారు. విద్యార్థులు రైల్వేట్రాక్‌లపై నడవడం, పరుగులెత్తడం సరికాదని, ఇటువంటి వారిపై రైల్వే యాక్ట్ ప్రకారం చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

విజయనగరం పూల్‌బాగ్: ఆర్‌కే జూనియర్ కళాశాల వార్షిక సంబరాలు స్థానిక అయ్యన్నపేట జంక్షన్‌లోని లక్ష్మీనారాయణ గార్డెన్ కల్యాణ మంటపంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ఐఓ ఎం. సత్యనారాయణ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోలా రామకృష్ణ, కరస్పాండెంట్ కోలా సంతోష్, డైరెక్టర్ కె. అంజనా, ప్రిన్సిపాల్ టి. ఆదిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు వ్యతిరేకంగా జర్నలిస్టుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

విజయనగరం అర్బన్: విజయనగరం పట్టణ జర్నలిస్టుల కోసం ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలంలో చోటు చేసుకుంటున్న ఆక్రమణలకు నిరసనగా పలువురు జర్నలిస్టులు గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయంలో రాష్ట్ర క్యాబినెట్ అనుమతితో ప్రభుత్వం నుంచి జర్నలిస్టుల సంఘం కొనుగోలు చేసి 30 మంది జర్నలిస్టులకు కేటాయించిన 1.63 ఎకరాల స్థలంలో వేరే వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడుతున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ మేరకు జర్నలిస్టులు డేవిడ్ రాజు, జయరాజ్, ఎం.భరత్‌కుమార్ నిరసన దీక్ష చేపట్టగా.. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర నాయకుడు శివప్రసాద్, జిల్లా నాయకులు పంచాది అప్పారావు, జె.శేషగిరితో పాటు జర్నలిస్టుల ఫెడరేషన్ నాయకులు ప్రసాద్, బూరాడ శ్రీనివాసరావు, జాప్ నాయకుడు గొర్లె సూరిబాబు, తదితరులు మద్దతు తెలియజేశారు. అలాగే వివిధ రాజకీయ పార్టీల నాయకులు కిమిడి నాగార్జున, ప్రసాదుల వరప్రసాద్, గురాన అయ్యలు, బుగత అశోక్, దయానంద్, శ్రీనివాస్, సతీష్, తదితరులు శిబిరాన్ని సందర్శించి జర్నలిస్టులకు సంఘీభావం తెలిపారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభం ప్రతిష్ఠలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలోని పైనాలవీధి జంక్షన్‌లో ఉన్న ఉమా రామలింగేశ్వర ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి ఆలయ పురోహితులు, కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్పొరేటర్ కుంటుభుక్త తవిటిరాజు మాట్లాడుతూ, అతి పురాతనమైన ఆలయమైన రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని దాతల సహకారంతో పునర్నిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ధ్వజస్తంభ ప్రతిష్ఠలో కోలగట్ల పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.

రైతులు సహకరించాలి

- తహసీల్దార్ రమణరాజు



రీసర్వేపై రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రమణరాజు

నెల్లిమర్ల రూరల్: సమగ్ర భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ రమణరాజు కోరారు. మండలంలోని బొప్పడాం గ్రామ సచివాలయంలో రైతులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ల తర్వాత భూముల రీ సర్వే జరుగుతోందన్నారు. డ్రోన్ కెమేరాలతో సర్వే చేపట్టి హద్దులు నిర్ణయిస్తామన్నారు. ఈ సర్వే వల్ల ఏళ్ల నాటి భూసమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కిరణ్, ఎంపీటీసీ సభ్యుడు బొంతు పురుషోత్తంనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుల ఆర్థిక ప్రణాళిక కీలకం

విజయనగరం అర్బన్: కుటుంబ వ్యవస్థ పటిష్ఠతకు వృద్ధుల ఆర్థిక ప్రణాళిక కీలకంగా నిలుస్తుందని కురి నెట్వర్క్ (జపాన్ కంపెనీ) ప్రెసిడెంట్ కేనేచీ ఇషికావా అన్నారు. గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'ఫండ్ మేనేజ్‌మెంట్ ఫర్ సీనియర్ సిటిజన్స్' అనే అంశంపై గురువారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వృద్ధుల ఆర్థిక ప్రణాళిక సక్రమంగా ఉంటే వారిపై ఆర్థిక మాంద్యం ప్రభావం చూపదన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం ముఖ్య అతిథిని ఘనంగా సత్కరించారు. రామ్‌తేజ్ టెక్నాలజీస్ జపాన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.వరూధిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇషికావాను సత్కరిస్తున్న సీతం కళాశాల ప్రతినిధులు

వచ్చే నెల 5,6 తేదీల్లో ఆపస్ మహాసభలు

విజయనగరం పూల్‌బాగ్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర మహాసభలు మార్చి 5, 6 తేదీల్లో నెల్లూరులో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను డీఈఓ బి. లింగేశ్వరరెడ్డి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇజ్జిరోతు రామునాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్. రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె. సాయికుమార్, ఏజీ తాతారావు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

నవధాన్యాల సాగుతో మేలు



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

విజయనగరం రూరల్: పంట సాగుకు ముందు పొలాల్లో నవధాన్యాలు చల్లడం వల్ల పొలాలకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎం.ఉమామహేశ్వరనాయుడు తెలిపారు. మండలంలోని రాకోడులో 'నవధాన్యాలు వేద్దాం – నేలతల్లిని కాపాడుకుందాం' అనే నినాదంతో రైతులతో పాటు వ్యవసాయాధికారులు, సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ, వరి పంట సాగుకు 45 రోజులు ముందుగా ఎకరానికి 13 కిలోల చొప్పున నవధాన్యాలు పొలాల్లో చల్లాలని తెలిపారు. ఈ విధంగా చేస్తే నేల గుల్లబారి సారవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రమేష్, ఏపీసీఎన్‌టీ ఎస్.మహేష్, సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17, 60వ సచివాలయాలను కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు. స్పందన రిజిస్టర్లను సక్రమంగా నిర్వహిస్తున్నారా, లేదా అని ఆరా తీశారు. అలాగే సచివాలయం వారీగా రెవెన్యూ వసూళ్లపై అడిగి తెలుసుకున్నారు. సఖి గ్రూపులు అధిక సంఖ్యలో ఏర్పాటు చేసి తద్వారా కౌమార బాలికలకు మానసిక, ఆరోగ్యపరంగా సంపూర్ణ అవగాహన కల్పించాలని ఆదేశించారు. సచివాలయాల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శులను ఆదేశించారు. అంగన్‌వాడీ పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీరాములనాయుడు

మహాశివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయాలు



టీటీడీ ఆవరణలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రొగ్రామింగ్ కన్వీనర్ శ్యామ్‌సుందర్, తదితరులు



పశుపతి నాథేశ్వరస్వామి ఆలయంలో స్పటికలింగం

విజయనగరం టౌన్: ఈ నెల 18న మహాశివరాత్రి సందర్భంగా నగరంలోని రింగ్‌రోడ్డులో గల ద్వాదశ జ్యోతిర్లింగ సహిత అపర్ణాదేవి సమేత పశుపతినాథేశ్వర ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. శనివారం వేకువజాము 3 గంటల నుంచి 4 వరకు స్పటిక లింగానికి క్షీరాభిషేకం నిర్వహిస్తామని శారదా సేవా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, గుడిశ శ్రీనివాసరావు తెలిపారు. అదేవిధంగా ఉదయం 6 గంటల నుంచి రుద్రాభిషేకాలు ఆలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 6 గంటలకు పశుపతినాథేశ్వరస్వామికి విశేష హారతి, స్పటికలింగ దర్శనం ఉంటాయన్నారు. రాత్రి 7 గంటలకు కాశీక్షేత్రం నుంచి తీసుకువచ్చిన 1116 సాలిగ్రామాలకు సహస్ర లింగార్చన, రాత్రి 11–30 నుంచి ఒంటిగంట వరకు లింగోద్భవ సమయంలో స్పటిక లింగానికి అభిషేకం, విశేష అలంకరణలు, హారతి ఉంటాయన్నారు.

రామతీర్థం, పుణ్యగిరికి ఆర్టీసీ సేవలు

జిల్లాలోని రామతీర్థం, పుణ్యగిరి క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ప్రజా రవాణాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. గతేడాదిలా ఈ ఏడాది కూడా ప్రత్యేక బస్సులకు సాధారణ చార్జీలనే వసూలు చేస్తున్నామన్నారు. విజయనగరం డిపో నుంచి రామతీర్థం పుణ్యక్షేత్రానికి మొత్తం 44 బస్సులు, పుణ్యగిరి క్షేత్రానికి 25 బస్సులు, సన్యాసయ్యపాలెం క్షేత్రానికి ఐదు బస్సులు ఎస్.కోట డిపో నుంచి నడుపుతున్నామన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి బస్ సర్వీసులు పెంచుతామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు

తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఈ ఏడాది ఘనంగా నిర్వహించనున్నట్లు టీటీడీ ప్రొగ్రామింగ్ కన్వీనర్ జె.శ్యామ్ సుందర్ తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జామి మండలం కొత్త భీమసింగిలో అన్నపూర్ణ సహిత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మహాశివరాత్రి రోజున బిల్వదళార్చన, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పీవీ నరసింహాచార్యులు, ప్రసాదరావు, మనోహర్, పెంటయ్య, భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.


ఎల్లమాంబ జాతరకు సర్వం సిద్ధం



అమ్మవారి జాతర మహోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

- 27న తొలేళ్లు, 28న సిరిమానోత్సవం
- కరపత్రాలను ఆవిష్కరించిన ఆలయ కమిటీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: భక్తుల కోర్కెలు తీర్చే సిరుల తల్లి ఎల్లమాంబ సిరిమానోత్సవానికి ఆలయ కమిటీ ప్రతినిధులు రంగం సిద్ధం చేశారు. మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాల ఎదురుగా ఉన్న ఎల్లమాంబ అమ్మవారు జాతర మహోత్సవాల కరపత్రాలను గురువారంరాత్రి ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 26న ఆదివారం చండీహోమం, 27న సోమవారం తొలేళ్ల ఉత్సవం, 28న మంగళవారం సాయంత్రం ఆలయ ఆవరణలో సిరిమాను మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు అగ్రపు సన్యాసిరాజు, చందక అప్పారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు బంటుపల్లి వెంకటరావు, సోము రామకోటేశ్వరరావు, సత్తిబాబు, వాలి,ప్రసాద్, అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమాంబ అమ్మవారు